సాక్షి జనగామ

శుక్రవారం | 6 | సెప్టెంబర్ | 2024



కల్లెడ ఆణిముత్యం దీప్తి..
వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం కల్లెడ గ్రామానికి చెందిన దీప్తి.. పారాలింపిక్స్‌లో పతకం తేవడంతో ఊరంతా సంబురాలు చేసుకుంటున్నారు. - 8లో▸



ప్రకృతి సేద్యంతోనే మానవ మనుగడ
ప్రకృతి వ్యవసాయంతోనే భవిష్యత్‌లో మానవ మనుగడ సాధ్యమని త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి అన్నారు. - 8లో▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం
30°/23°
జిల్లాలో ఆహ్లాదకర వాతావరణం ఉంటుంది. మధ్యాహ్నం ఎండ మామూలుగా ఉంటుంది. రాత్రి చల్లగాలులు వీస్తాయి. పలుచోట్ల చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

పక్షోత్సవాలను జయప్రదం చేయండి



బచ్చన్నపేట: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట పక్షోత్సవాలను జయప్రదం చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎండీ అబ్బాస్, జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి అన్నారు. మండలంలోని తమ్మడపల్లిలో అమరవీరుల స్తూపం వద్ద బాధిత కుటుంబ సభ్యులను గురువారం సన్మానించారు. అనంతరం వారు మాట్లాడుతూ బెల్లం కొండయ్య, రామచంద్రయ్య, మట్టి నర్సయ్యల త్యాగాలు మరువలేనివని, వారి ఆశయ సాధనకు ఉద్యమించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యుడు చుంచు విజేందర్, బెల్లం కొండ వెంకటేష్, రావుల రవీందర్ రెడ్డి, బండకింది బలనారాయణ, ఎల్లయ్య, అశోక్, రవీందర్ రెడ్డి, బలరాములు, రాజయ్య, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ పథకాలతోనే బలహీన వర్గాల అభివృద్ధి



నర్మెట/జనగామ రూరల్: మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలతోనే బడుగు బలహీన వర్గాలు, రైతులు అభివృద్ధి చెందారని ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ మండలంలో 66 మందికి రూ.66,07,656 లక్షల చెక్కులను అందజేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఎం. మహిపాల్ రెడ్డి, ఎంపీడీఓ (ఎఫ్ఏసీ) అరవింద్ చౌదరి, ఆర్ఐ సాయిబాబా, టీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు గద్దల నర్సింగారావు, పెద్ది రాజిరెడ్డి, చింతకింది సురేష్, సుధాకర్, గోవర్ధన్, శ్రీనివాస్, ఎండి గౌస్, తదితరులు పాల్గొన్నారు. అలాగే పట్టణంలోని ఓ గార్డెన్‌లో 83 మందికి కల్యాణలక్ష్మీ, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పోకల జమున, మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ రామచంద్రం, కౌన్సిలర్ స్వరూప, అనిత, సిద్ధిలింగం, తహసీల్దార్ వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

నేడు 'సుద్దాల' స్వీయ రచన ఆవిష్కరణ



జనగామ: తెలుసు సినిమా పాటలు, కథా రచయిత, సాహిత్య కారుడు డాక్టర్ సుద్దాల అశోక్ తేజ రచించి గానం చేయనున్న స్వీయ రచన 'శ్రీ శూద్ర గంగావతరణం' నేడు (శుక్రవారం) ఆవిష్కరించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహం వద్ద పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం నిర్వాహకులు బల్ల శ్రీనివాస్, సమన్వయ కర్త పొట్టబత్తిని భాస్కర్‌లు మాట్లాడుతూ జిల్లా కేంద్రంలోని సూర్యాపేట రోడ్డు కెమిస్ట్రీ భవన్‌లో శుక్రవారం సాయంత్రం 6 గంటలకు ఆవిష్కరణ కార్యక్రమం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమానికి సాహిత్య అభిమానులు, అన్ని వర్గాల ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, మంతెన వీరనర్సయ్య, దేవరాజు, కృష్ణ, అయిలా సోమనర్సింహాచారి, లగిశెట్టి ప్రభాకర్, బూరెల రామకృష్ణ, పిట్టల ఆంజనేయులు, లక్ష్మణ్, సాయి కిరణ్ తదితరులు ఉన్నారు.

రాష్ట్ర అవార్డు అందుకున్న సుధాకర్‌రెడ్డి



జఫర్‌గఢ్: మండలంలోని తిడుగు ప్రభుత్వ ఉన్న పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు కందూరు సుధాకర్‌రెడ్డి రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు అందుకున్నారు. హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో మంత్రి పొన్నం ప్రభాకర్ చేతుల మీదుగా గురువారం అవార్డును అందుకున్నారు. తన సేవలను గుర్తించి ప్రభుత్వం రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయుడి అవార్డుతో సత్కరించడం ఎంతో ఆనందంగా ఉందని సుధాకర్‌రెడ్డి తెలిపారు.

ఉచిత విద్యుత్



జీఓ వచ్చింది..
ప్రభుత్వ విద్యాసంస్థలకు ఉచిత విద్యుత్ సరఫరాకు సంబంధించి ప్రభుత్వం జీఓ విడుదల చేసింది. ఇందుకు సంబంధించి ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి ఆదేశాలను అనుసరించి ముందుకు వెళ్తాం. జిల్లాలో ప్రభుత్వ విద్యా సంస్థలకు సంబంధించి గతంలోనే ఆన్‌లైన్ పోర్టల్‌లో వివరాలను నమోదు చేశాం. జీఓలో పేర్కొన్న నిబంధనలను అనుసరించి ఉచిత విద్యుత్ సరఫరాను అందిస్తాం.
- వేణుమాధవ్, ఎన్పీడీసీఎల్ ఎస్ఈ, జనగామ

ప్రభుత్వ పాఠశాలలకు ఫ్రీ కరెంట్
- జీఓ విడుదల చేసిన సర్కారు
- 665 పాఠశాలలు, గురుకులాల్లో వెలుగులు
- ఆన్‌లైన్ పోర్టల్‌లో బడుల వివరాలు



జనగామ:

రాష్ట్రంలో ప్రభుత్వ విద్యాసంస్థలకు ఉచిత విద్యుత్ సరఫరాకు ఆర్థిక మంత్రి, ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క గురువారం సాయంత్రం జీఓ జారీ చేశారు. గత నెల 10వ తేదీన 'స్కూళ్లకు ఉచిత కరెంట్' శీర్షికన సాక్షి ముందుగానే వార్తా కథనం ప్రచురితం చేసిన విషయం విధితమే. ఈ జీఓ తక్షణమే అమలులోకి వస్తుందని ఆదేశాలు జారీ చేస్తూ.. ఇందుకు సంబంధించి నిబంధనలు జీఓలో జతపరిచారు. జిల్లాల వారీగా ప్రభుత్వ విద్యాసంస్థలకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని సంబంధిత శాఖ అధికారుల ద్వారా తీసుకుని, దానిని అధికారికంగా ధృవీకరించిన తర్వాత ఎన్పీడీసీఎల్ ఆన్‌లైన్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేస్తారు. ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్నప్పటికీ, ఎప్పటిలాగే నెల వారి బిల్లింగ్.. యూనిట్ల ఖర్చు చేసి డిపార్టుమెంట్ లాగిన్‌లో అప్‌లోడ్ చేయడంతో పాటు విద్యాసంస్థల హెడ్‌కు బిల్లు ఆర్డర్ కాపీ అందిస్తారు. కాగా విద్యా శాఖ, ఎన్పీడీసీఎల్ రెండు శాఖల సమన్వయంతో పాఠశాలల వారీగా ఎన్ని గదులు, పిల్లల సంఖ్య, కరెంటు లోడ్, కేటగిరీ, సర్వీసు నంబర్ తదితర వివరాలను ఈ ఏడాది జూలై మాసంలో ప్రభుత్వానికి నివేదించారు. అలాగే జూలై మాసంలో ఖర్చయిన యూనిట్లు, పెండింగ్ బకాయిలను అందులో పేర్కొన్నారు.

తగ్గనున్న ఆర్థిక భారం

సర్కారు బడులు, గురుకులాలకు ప్రభుత్వం ఉచిత విద్యుత్ సరఫరా చేసేందుకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో ఆర్థిక భారం తప్పనుంది. ఇప్పటికే 2 వందల యూనిట్ల లోపు గృహ వినియోగదారులతో పాటు పలు కులవృత్తులకు సైతం ఉచిత కరెంట్ ఇస్తున్న విషయం తెలిసిందే. జిల్లాలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత, మోడల్, కేజీబీవీ, గురుకులాలు, హాస్టల్స్ 665 వరకు ఉన్నాయి. ఇందులో 125 పాఠశాల (6, 8వ తరగతి)లో డిజిటల్ తరగతులు(టీవీలు), 91 పాఠశాలలో కంప్యూటర్లు, 317 ప్రాథమిక పాఠశాలల్లో మినీ ట్యాబుల ద్వారా సాంకేతికతను అందిపుచ్చుకుని విద్యార్థులకు బోధన చేస్తున్నారు.

రూ.1.32 కోట్ల బకాయిలు

జూలై 4వ తేదీ నుంచి ఆగస్టు 4 వరకు రూ. 1,21,520 యూనిట్ల విద్యుత్ వినియోగం జరుగగా, మొత్తంగా రూ. 1.32 కోట్ల మేర కరెంటు బకాయిలు ఉన్నాయి. జనగామ, రఘునాథపల్లి, స్టేషన్‌ఘన్‌పూర్, జఫర్‌గఢ్, పాలకుర్తి మండలాల పరిధిలో అత్యధికంగా విద్యుత్ బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి.

మండలాల వారీగా విద్యుత్ బకాయిల వివరాలు (రూ.లక్షల్లో)

మండలం	సర్వీసులు	జూలై యూనిట్స్	బకాయిలు
జఫర్‌గఢ్	57	11,791	13.16
నర్మెట	41	5,149	8.02
జనగామ	108	28,651	30.72
బచ్చన్నపేట	60	6,081	5.95
లింగాలఘణపురం	44	4,690	4.60
పాలకుర్తి	53	15,678	17.37
దేవరుప్పుల	51	5,599	7.34
రఘునాథపల్లి	70	6,294	15.28
తరిగొప్పుల	31	2,897	6.20
చిల్పూరు	36	4,426	3,79
కొడకండ్ల	45	8,050	5.13
స్టేషన్‌ఘన్‌పూర్	69	22,216	14.92
మొత్తం	665	1,21,520	రూ.1.32కోట్లు

అయ్యో పాపం!

- భారీ వర్షాలకు కూలిన ఇళ్లు
- ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుల వేడుకోలు

ఇటీవల కురిసిన భారీ వర్షాలకు జిల్లాలోని పలు గ్రామాల్లో ఇళ్లు నేలమట్టమయ్యాయి. మూడు రోజుల పాటు ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షంతో పెంకుటిల్లు, గోడలు కూలిపోవడంతో నిలువ నీడ లేకుండా పోయిందని, ప్రభుత్వం తమను ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు. అయితే ఆయా కూలిన ఇళ్లు, ప్రహరీలను అధికారులు పరిశీలించారు.

నర్మెట: మండలకేంద్రానికి చెందిన ప్రజ్ఞాపురం మల్లయ్య, మచ్చుపహాడ్‌కు చెందిన కొంపెల్లి రేణుక, లోక్యతండాలో మాలోత్ మేగ్యా, అమర్ సింగ్ తండాకు చెందిన భూక్య గోబ్రియా, మాన్సింగ్ తండాకు చెందిన భూక్య సీతారాం, భూక్య రాజు, భూక్య బలరాంలకు చెందిన ఇళ్లు కూలిపోగా అధికారులు సందర్శించి పంచనామా చేశారు. పరిశీలించిన వారిలో ఆర్ఐ సాయిబాబా, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

కూలిన ఇళ్ల పరిశీలన

తరిగొప్పుల: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు మండల వ్యాప్తంగా పలు గ్రామాల్లో కూలిన పెంకుటిండ్లను రెవెన్యూ అధికారులు పరిశీలించారు. మండలకేంద్రంతో పాటు సోలిపూర్, నర్సాపూర్‌కు చెందిన బొంకూరు ఆగమల్లమ్మ, సలీమా, అల్లిబిల్లి అంజయ్య పెంకుటిండ్లు వర్షాలకు కూలిపోగా తహసీల్దార్ నాగేశ్వరచారి ఆదేశాల మేరకు క్షేత్ర స్థాయిలో పరిశీలించామన్నారు. నివేదిక ఉన్నతాధికారులకు పంపిస్తామని ఆర్ఐ రవీందర్ తెలిపారు. పంట నష్టం వాటిల్లిన, ఇళ్లు కూలిపోయినా రెవెన్యూ అధికారులకు సమాచారం అందించాలని సూచించారు.



నర్మెట: కూలిన ఇళ్లను పరిశీలిస్తున్న ఆర్ఐ సాయిబాబా

బండనాగారంలో..

బచ్చన్నపేట: మండలంలోని పలు గ్రామాల్లో వర్షాలకు పలువురి ఇళ్లు, ప్రహరీలు నేలమట్టమయ్యాయి. ఈ మేరకు పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో తిరిగి కూలిన ఇళ్ల వివరాలను నమోదు చేసుకున్నారు. ఇళ్లు కూలిన వారికి నూతన ఇళ్లను మంజూరు చేయాలని బాధితులు కోరుతున్నారు.

ప్రభుత్వం ఆదుకోవాలి

చిల్పూరు: భారీ వర్షాలతో కూలిన ఇళ్ల యజమానులను ప్రభుత్వం ఆదుకోవాలని బీజేపీ మండల అధ్యక్షుడు గంటి ఉపేందర్ యాదవ్ కోరారు. మండలంలోని నష్కల్, చిల్పూరు గ్రామాల్లో వర్షాలతో గొల్లపల్లి శైలేష్, నరకంటి వెంకటమ్మ, యాదగిరిల పెంకుటిల్లు కూలిపోగా వాటిని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేద కుటుంబాలకు చెందిన బాధితులకు ఆర్థిక సాయంతో పాటు ఇందిరమ్మ ఇళ్లు అందజేయాలని కోరారు. పార్టీ నాయకులు ఎలిశాల శ్రీనివాస్, తోట శ్రీనివాస్, పెండ్యాల దిలీప్ ఉన్నారు.

యథావిధిగా రైళ్ల రాకపోకలు

కాజీపేట రూరల్: కాజీపేట జంక్షన్, వరంగల్ రైల్వేస్టేషన్ల మీదుగా ప్రయాణించే పలు రైళ్లను గురువారం నుంచి యథావిధిగా నడిపిస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. ఇంటికన్నె–తాళ్లపూసపల్లి రైల్వే ట్రాక్ ఘటనతో నాలుగు రోజుల పాటు పలు రైళ్ల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడి ప్రయాణికులు ఇబ్బంది పడిన విషయం తెలిసిందే. ఈమేరకు రైల్వే అధికారులు ట్రాక్ పునరుద్ధరణ పనులు చేపట్టి ట్రైన్స్‌ను రిస్టోరేషన్ చేసి యథావిధిగా నడిచేలా చర్యలు తీసుకున్నారు. దీంతో పలు రైళ్లు నిర్ణీత సమయానికన్నా ఆలస్యంగా నడుస్తున్నాయి.

ఎన్నాళ్లీ.. తిప్పలు..

- తాత్కాలిక రోడ్డు తెగి నాలుగు రోజులు
- అదనంగా 25 కిలోమీటర్ల ప్రయాణం
- రోజువారీ కూలీలకు ఇబ్బందులు

లింగాలఘణపురం/పాలకుర్తి : మండలంలోని కుందారం–పాలకుర్తి రోడ్డులో పటేల్‌గూడెం వాగుపై బ్రిడ్జి నిర్మిస్తున్నారు. ప్రజల రవాణా కోసం తాత్కాలిక రోడ్డు ఏర్పాటు చేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు నెల్లుట్ల వాగు ప్రవాహంతో రోడ్డు తెగిపోయింది. నాలుగు రోజులైనా దారి పునరుద్ధరించకపోవడంతో కుందారం, కిష్టగూడెం, చీటూరు, దేవరుప్పుల మండలం కోలుకొండ, పాలకుర్తి మండలానికి చెందిన రోజువారీ కూలీలతో పాటు జనగామకు వెళ్లే ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. వీరంతా జనగామకు వెళ్లాలంటే వయా రఘునాథపల్లి మండలం బాంజీపేట, నిడిగొండ మీదుగా లేదంటే అప్పిరెడ్డిపల్లి, చిన్నమడూరు, నేలపోగుల మీదుగా చేరుకోవాల్సి ఉంటుంది. ఇందుకు 25 కిలోమీటర్లు అదనంగా ప్రయాణించాల్సి వస్తున్నది. అంతేకాకుండా వాగు అవతల ఉన్న పటేల్‌గూడెం రైతులు వ్యవసాయ బావుల వద్దకు చేరుకోవడానికి జనగామ, నిడిగొండ, కుందారం మీదుగా వెళ్లాల్సి వస్తోంది. బ్రిడ్జి నిర్మాణంలో రెండు పిల్లర్ల మధ్య స్లాబ్ వేశారు. ప్రస్తుతం వస్తున్న నీటిని పిల్లర్ల మధ్య నుంచి మళ్లించి.. ప్రస్తుతం ఉన్న పైపులను తాత్కాలిక రోడ్డుపై వేస్తే ప్రయాణానికి అనుకూలంగా ఉంటుందని పలువురు అభిప్రాయ పడుతున్నారు. అలాగే ఎడతెరిపి లేని వర్షాలకు పాలకుర్తి మండలం విస్నూరు గ్రామానికి చెందిన రైతు రమేశ్‌కు చెందిన ఏడెకరాల పెసర పంట నష్టం వాటిల్లడంతో వ్యవసాయ అధికారి శరత్ చంద్ర పరిశీలించారు.



లింగాలఘణపురం: పటేల్‌గూడెం వాగుపై నిర్మిస్తున్న బ్రిడ్జి వద్ద తెగిన తాత్కాలిక రోడ్డు

కౌలు రైతుల కష్టం వరద పాలు


చిల్పూరు: కౌలుకు తీసుకుని పంటలు సాగు చేయగా ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పంట వరద పాలు అయిందని కౌలు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని కష్టాజీగూడెం గ్రామానికి చెందిన కౌలు రైతులు వడ్లకొండ రమేష్, ఊరడి రమేష్‌లు కౌలుకు తీసుకుని వరి సాగు చేస్తున్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మత్తడి కాల్వ సరిగా లేక వీరి పంట పొలాలు నీట మునిగాయని, ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

నాలుగు రోజులుగా పనిలేదు..




పటేల్‌గూడెం వద్ద రోడ్డు తెగిపోవడంతో రోజువారీగా జనగామకు వెళ్లి సెంట్రింగ్ పనులు చేయడం బంద్ అయ్యింది. నాలుగు రోజులుగా వెళ్లడం లేదు. తప్పనిసరి అయితే బాంజీపేట, నిడిగొండ, యశ్వంతాపూర్ నుంచి జనగామకు పోవాల్సి వస్తున్నది. త్వరగా మరమ్మతు చేయాలి.
- ఎర్ర నవీన్, చీటూరు, సెంట్రింగ్ మేస్త్రీ

అప్పు చేసి కౌలుకు తీసుకున్న..



అప్పు చేసి పొలం కౌలుకు తీసుకున్న. ఇటీవల కురిసిన భారీ వర్షాలతో పంటలకు నీరందించే కాలువ సరిగా లేక పొలం నీట మునిగింది. దీంతో పెట్టిన పెట్టుబడి రూ.35వేల వరకు నష్టపోయిన. ప్రభుత్వం ఆదుకోవాలి.
-రమేష్, రైతు

పొలం పనులకు పోలేని పరిస్థితి..



రోడ్డు తెగడంతో వాగు అవతల ఉన్న పొలాల వద్దకు వెళ్లలేక పోతున్నాం. మామూలుగా అయితే 2కిలోమీటర్లు ఉంటుంది. ఇప్పుడు జనగామ, నిడిగొండ, బాంజీపేట, కుందారం మీదుగా వెళ్లాల్సి వస్తున్నది.
- పెంతల రాజు, రైతు, పటేల్‌గూడెం

గణపతి పూజలకు వేళాయె..

- జోరుగా వినాయక విగ్రహాల అమ్మకాలు
- జిల్లా కేంద్రంలో 1,200 ప్రతిమల తయారీ
- ముస్తాబవుతున్న మండపాలు
- కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో మట్టి గణపతులపై ప్రచారం



జిల్లా కేంద్రంలో గణపతి ప్రతిమలు



ట్రాక్టర్‌లో వినాయకుడి ప్రతిమను తీసుకెళ్తున్న భక్తులు

జనగామ: మహిమాన్వితమైన మహాగణపతి రూపం భక్తులకెంతో అపురూపం. కోర్కెలు తీర్చే గణనాథుడు సాక్షాత్కరిస్తే అది ఎన్నో జన్మల పుణ్యఫలం. జిల్లాలో నవరాత్రి ఉత్సవాలకు కమిటీ సభ్యులు, భక్తులు మండపాలను సిద్ధం చేస్తున్నారు. ప్రకృతి దేవుడైన వినాయకుడిని... విషపూరితమైన రసాయనాలతో కాకుండా సహజ సిద్ధమైన రంగులు, బంకమట్టితో తయారు చేసే పనిలో తయారీదారులు నిమగ్నమయ్యారు. కొందరు తయారీదారులు ఆరు నెలల ముందు నుంచే వినాయక విగ్రహాల తయారీని ప్రారంభించారు. వినాయక చవితి పండుగను పురస్కరించుకుని జిల్లాలో విగ్రహాల అమ్మకాలు జోరందుకున్నాయి. రాజస్తాన్ రాష్ట్రానికి చెందిన కుటుంబాలు రెండు దశాబ్దాల క్రితం ఇక్కడే స్థిర నివాసం ఏర్పరుచుకుని ప్రతిమలను తయారు చేస్తున్నారు. ఈ సారి 12 వందలకు పైగా వినాయక విగ్రహాలను తయారు చేయగా.. అమ్మకాలు గతంకంటే పెరిగాయి. అడుగు సైజు నుంచి పది, 12 ఫీట్ల ఎత్తులో రూ.100 నుంచి రూ.40వేల ధరల్లో అనేక రూపాల అలంకరణలో విగ్రహాలు ఆకట్టుకుంటున్నాయి. స్టేషన్‌ఘన్‌పూర్, హన్మకొండ, సూర్యాపేట, నల్లగొండ, చేర్యాల, సిద్దిపేట తదితర ప్రాంతాలకు ఇక్కడ నుంచి విగ్రహాలను తరలిస్తున్నారు.

పర్యావరణ పరిరక్షణకు..

పర్యావరణ పరిరక్షణకు మట్టి గణపతి విగ్రహాలను మాత్రమే పూజించాలని పొల్యూషన్ బోర్డు శాఖతో పాటు జిల్లా యంత్రాంగం, స్వచ్ఛంద సంస్థలు పెద్ద ఎత్తున ప్రచారం చేస్తున్నారు. గణేశ్ ఉత్సవ కమిటీ నిర్వాహకులు ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారు చేసిన ప్రతిమలనే ఎక్కువగా కొనుగోలు చేస్తున్నారు. అయితే తయారీదారులతో పాటు రిటైల్ అమ్మకం దారులు వరుణుడిపై భారం వేసి విక్రయాలు జరుపుతున్నారు. వాతావరణం అనుకూలిస్తేనే లాభం చేకూరుతుందంటున్నారు.

మట్టి గణపతులను పూజిద్దాం..



మట్టితో తయారు చేసిన గణపతి ప్రతిమలనే పూజించాలి. ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారుచేసిన విగ్రహాలు చెరువుల్లో నిమజ్జనం చేయడంతో నీరంతా కలుషితమవుతుంది. జిల్లాలో మట్టి ప్రతిమలపై పెద్ద ఎత్తున ప్రచారం చేస్తూ అవగాహన కల్పిస్తున్నాం. శనివారం జిల్లా కేంద్రం నెహ్రూ పార్కు ఏరియాలో కలెక్టర్ చేతుల మీదుగా సుమారు 2వేలపైగా మట్టి గణపతులను ఉచితంగా పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం.
- సునీత, కాలుష్య నియంత్రణ మండలి బోర్డు ఈఈ, ఉమ్మడి వరంగల్

రూ.20లక్షల పెట్టుబడి..



ఆరు నెలల నుంచి కష్టపడుతూ మూడు వందలకు పైగా వినాయక విగ్రహాలను తయారుచేశాం. ఇందుకు సుమారు రూ.20లక్షల ఖర్చు చేశాం. అర ఫీట్ నుంచి 15 ఫీట్ల వరకు విగ్రహాలకు రూ.100 నుంచి రూ.40వేల వరకు ధర పలికే ప్రతిమలు ఉన్నాయి. గతేడాది కంటే ఈసరి అమ్మకాలు పెరిగాయి.
- బూర అరవింద్, తయారీదారుడు, జనగామ

పర్యాటకుల సౌకర్యార్థం ఎలక్ట్రిక్ ఆటోలు

- డీఆర్‌డీఓ వసంత

పాలకుర్తి టౌన్: పాలకుర్తి, బమ్మెర, వల్మిడి ప్రాంతాలను సందర్శించేందుకు పర్యాటకుల సౌకర్యార్థం ఎలక్ట్రిక్ ఆటోలను ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు డీఆర్‌డీఓ వసంత తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని సోమనాథుడి ఆడిటోరియాన్ని అదనపు పీడీ శ్రీనివాస్‌తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాలకుర్తి ప్రాంతం పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు మహిళా శక్తి పథకంలో మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించాలన్న లక్ష్యంతో ఎలక్ట్రికల్ ఆటోలను సమకూర్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. సోమనాథుడి ఆడిటోరియం వద్ద సందర్శకుల కోసం మహిళా శక్తి పథకంలో హోటల్‌ను ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారన్నారు. గిరగాని సుధ, ప్రమీల, పిట్టల నరేందర్, అనురాధ, అనిత, అరుణ, స్వరూప ఉన్నారు.



స్మృతి వనాన్ని సందర్శించిన వసంత

లోకల్ కోర్టును సద్వినియోగం చేసుకోవాలి



వినతిపత్రం స్వీకరిస్తున్న వేణుగోపాలచారి

పాలకుర్తి: విద్యుత్ వినియోగదారులు లోకల్ కోర్టులను సద్వినియోగం చేసుకోవాలని సీజీఆర్ఎఫ్ చైర్మన్ ఎన్వీ వేణుగోపాలచారి అన్నారు. గురువారం పాలకుర్తిలోని ఏడీఈ కార్యాలయంలో విద్యుత్ వినియోగదారుల లోకల్ కోర్టు నిర్వహించారు. ఇందులో 23 ఫిర్యాదులు రాగా 13 ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ లోకల్ కోర్టులో విద్యుత్ పునరుద్ధరణ, కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్లు మార్చడం, తదితర సమస్యలు ఉంటే రాత పూర్వకంగా ఇవ్వొచ్చని తెలిపారు. పాలకుర్తి, కొడకండ్ల మండలాల వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ మెంబర్ కె. రమేశ్, ఆర్.చరణ్ దాస్, ఎస్.నరేందర్, టి.వేణుమాదవ్, జయరాజు, తదితరులు పాల్గొన్నారు.

సమాజాభివృద్ధిలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం

- విద్యార్థుల ఉన్నత భవితకు సోపానం గురువు
- ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి
- కలెక్టరేట్‌లో ఘనంగా గురుపూజోత్సవం

జనగామ రూరల్: సమాజాభివృద్ధిలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి అన్నారు. గురువారం సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని ప్రధాన సమావేశ మందిరంలో కలెక్టర్ రిజ్వాన్ బాషా అధ్యక్షతన అదనపు కలెక్టర్ రోహిత్ సింగ్‌తో కలిసి జిల్లా విద్యా శాఖ ఆధ్వర్యంలో ఘనంగా గురుపూజోత్సవం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే రాజేశ్వర్‌రెడ్డి హాజరై జ్యోతిప్రజ్వలన చేసిన అనంతరం మాట్లాడారు. భారతరత్న డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ఆశయాలను పాటించాలన్నారు. ఉపాధ్యాయులు స్ఫూర్తి ప్రదాతగా అనేక విప్లవాలకు మూల పురుషుడు టీచర్ అని, ఈ విద్యా విప్లవంలో అందరూ భాగస్వాములు కావాలన్నారు. అనంతరం కలెక్టర్ రిజ్వాన్ బాషా మాట్లాడుతూ బడి బాట కార్యక్రమ నిర్వహించి, వివిధ కారణాలతో బడి మానేసిన విద్యార్థులను గుర్తించి, వారిలో స్ఫూర్తిని నింపి, ఉన్నతంగా తీర్చిదిద్దే బాధ్యతను ఉపాధ్యాయులు మరింతగా ముందుకు తీసుకెళ్లాలన్నారు. అలాగే నవంబర్‌లో జరిగే నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే ఎన్ఎస్ఏ పరీక్షలో ఉత్తీర్ణత సాధించే దిశగా విద్యార్థులను సన్నద్ధత చేయాలన్నారు. ఈ విద్యాసంవత్సరంలో పది ఫలితాల్లో విద్యార్థులు 10/10 జీపీఏ సాధించే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా ఆగస్టు 15న స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా నిర్వహించిన పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు రూ.10 వేలు, రూ. 5 వేల చొప్పున నగదు బహుమతి అందజేశారు. జిల్లాలోని వివిధ పాఠశాలలకు చెందిన 75 మంది ఉత్తమ ఉపాధ్యాయులను సత్కరించి మెమోంటో అందించారు. ఈ సందర్భంగా విద్యార్థినుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పోకల జమున, కౌన్సిలర్ పగిడిపాటి సుధ, డీఈఓ రాము, నరేందర్ రెడ్డి, గంటా రవీందర్, డీపీఓ స్వరూప, డీఆర్డీఏ వసంత, డీఏఓ రామారావు నాయక్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ప్రశంస పత్రం అందజేస్తున్న కలెక్టర్ రిజ్వాన్ బాషా, పక్కన ఎమ్మెల్యే రాజేశ్వర్‌రెడ్డి తదితరులు

క్లుప్తంగా

అంతర్జాతీయ కబడ్డీ పోటీల్లో మల్సూర్ ప్రతిభ


పతకం అందుకుంటున్న మల్సూర్

డోర్నకల్: నేపాల్‌లో జరిగిన అంతర్జాతీయ కబడ్డీ పోటీల్లో డోర్నకల్ మండలం చాప్లాతండాకు చెందిన క్రీడాకారుడు ప్రతిభ కనబర్చాడు. తండాకు చెందిన ధారావత్ మల్సూర్ నేపాల్‌లోని పోఖ్రాలో ఈ నెల 1వ తేదీన ఇంటర్నేషనల్ యూత్ స్పోర్ట్స్ అండ్ ఎడ్యుకేషనల్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఇంటర్నేషనల్ చాంపియన్‌షిప్ టోర్నమెంట్ కబడ్డీ పోటీల్లో భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించాడు. ఫైనల్‌లో నేపాల్.. ఇండియా జట్టుపై విజయం సాధించడంతో ఇండియా సిల్వర్ పతకం పొందింది. ఫైనల్‌లో మల్సూర్ జట్టు 15 పాయింట్లు సాధించడంతో బెస్ట్ ఆల్‌రౌండర్ పతకం అందుకున్నాడు. ఈ సందర్భంగా మల్సూర్‌ను స్థానికులు అభినందించారు.

కాళేశ్వరం ప్రాజెక్టు కేసు వచ్చే నెల 17కు వాయిదా

భూపాలపల్లి అర్బన్: జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కాళేశ్వరం మేడిగడ్డ ప్రాజెక్టులో అవినీతిపై భూపాలపల్లికి చెందిన వ్యక్తి జిల్లా కోర్టులో పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో జిల్లా కోర్టుకు గురువారం మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు, కాంట్రాక్టర్ మెగా కృష్ణారెడ్డి, అధికారులు సబర్వాల్, రజత్‌కుమార్, ఎల్‌అండ్‌టీ కంపెనీ ప్రతినిధుల తరఫున న్యాయవాదులు నరసింహారెడ్డి, ఆదానీ హాజరయ్యారు. జడ్జి నారాయణబాబు కేసును వచ్చే అక్టోబర్ 17వ తేదీకి వాయిదా వేసినట్లు తెలిసింది.

తన వాటా ఇప్పించాలని తహసీల్ ఎదుట నిరసన

- మందు డబ్బాతో బాధితుల ఆందోళన


తహసీల్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న బాధితురాలు యశోద

జనగామ రూరల్: తన భర్త తేజావత్ శ్రీనివాస్ వాటా తమకు ఇప్పించాలని జనగామ మండలం ఎర్రగొల్లపహాడ్ జీపీ పరిధి పెద్దతండా (వై)కి చెందిన యశోద తన ముగ్గురు పిల్లలతో కలిసి తహసీల్దార్ కార్యాలయం ఎదుట గురువారం నిరసనకు దిగింది. పురుగుల మందు డబ్బాతో ఆత్మహత్యాయత్నానికి యత్నించగా తహసీల్ సిబ్బంది మందుడబ్బా లాక్కుని పోలీసులకు సమాచారం ఇచ్చారు. బాధితురాలు యశోద కథనం ప్రకారం.. తండాలోని 85/ఎ/1 సర్వే నంబర్‌లో 14 ఎకరాల భూమి ఉండగా.. వారసత్వ వాటాగా 3 ఎకరాలు రావాల్సి ఉండగా.. తన భర్త అన్నదమ్ములు అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేసింది. తనకు ఇద్దరు ఆడపిల్ల లు ఉన్నారని, భూమి ఇప్పించకుంటే కుటుంబంతో సహా ఎమ్మార్వో కార్యాలయం వద్ద పురుగుల మందు తాగి చావడం తప్ప వేరే దారి లేదని పేర్కొంది. కాగా, విషయంపై తహసీల్దార్ వెంకన్నను వివరణ కోరగా బాధితురాలి పేరుతో భూమి లేదు.. గతంలో ఈ విషయంపై వివరించాం.. చట్టం ప్రకారం ఎవరి పేరుతో భూమి ఉంటే వారు చె ప్పిన వారికి స్లాట్ బుక్ చేసుకుంటే పట్టా చేయాల్సిందేనని స్పష్టం చేశారు.

మట్టి వినాయకుడే శ్రేయస్కరం



వినాయక చవితి సందర్భంగా ఏర్పాటు చేసే విగ్రహాల విషయంలో పూర్తిగా భక్తి శ్రద్ధలు ఉండాలి. అందరూ ఆరోగ్యంగా ఉండాలంటే మట్టితో చేసిన ప్రతిమలనే ప్రతిష్ఠించి నవరాత్రులు పూజించడం శ్రేయస్కరం. మండపాలపై అందరూ మట్టి వినాయకులను ఏర్పాటు చేసుకోవాలి.

-గంగు ఉపేంద్రశర్మ, వేయిస్తంభాల దేవాలయ ప్రధానార్చకుడు, హనుమకొండ

పర్యావరణాన్ని కాపాడుదాం



ప్లాస్టర్ ఆఫ్ ప్యారీస్‌తో పాటు వినాయక ప్రతిమల కోసం వినియోగించే కెమికల్ రంగులతో పర్యావరణానికి ముప్పు కలుగుతుంది. ప్రకృతికి తీవ్ర హాని కలుగుతుంది. ప్రతి ఒక్కరూ చైతన్యవంతులు కావాలి. మట్టి వినాయకులను ప్రతిష్ఠించుకుందాం. పర్యావరణాన్ని కాపాడుకుందాం.

- న్యాలకొండ భాస్కర్‌రావు, కన్వీనర్, వరంగల్ మహానగర్ గణపతి నవరాత్రి ఉత్సవ సమితి

ఇదే నా జీవనాధారం



వినాయక విగ్రహాల తయారీ పనిపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నాం. వినాయక చవితి సమయాల్లో మాత్రమే తెలంగాణ వైపు వస్తాం. ఆ తర్వాత కోల్‌కతా వెళ్లిపోతాం. దసరా ఉత్సవాలకు సంబంధించి అక్కడ దుర్గాదేవీ విగ్రహాలు తయారు చేస్తాం.

- చందన్, కోల్‌కతా, విగ్రహాల తయారీదారుడు

మట్టి విగ్రహాలే శ్రేష్ఠం



20 ఏళ్లుగా మట్టి వినాయక విగ్రహాలను తయారు చేస్తున్నా. ప్లాస్టర్ ఆఫ్ ప్యారీస్‌తో చేసే విగ్రహాలు పర్యావరణానికి హాని కలిగిస్తుంది. ప్రతి ఒక్కరూ మట్టితో చేసే విగ్రహాలను పూజించాలి. వినాయక చవితి సమయంలో ఇలా ఉపాధి దొరుకుతుంది. మిగతా రోజుల్లో కోల్‌కతాకు వెళ్లి పనులు చేసుకుంటాం.

-భీష్మ, కోల్‌కతా, విగ్రహాల తయారీదారుడు

మట్టి గణపతికే జై..

మట్టి వినాయకులనే పూజిద్దాం
- పర్యావరణాన్ని పరిరక్షించుకుందాం
- మొదలైన నవరాత్రోత్సవాల సందడి
- విగ్రహాలకు తుది మెరుగులు దిద్దుతున్న కళాకారులు

హన్మకొండ కల్చరల్: ఊరూ.. వాడ సందడిగా నిర్వహించే వినాయక చవితి సమీపిస్తోంది. ఉత్సవాలు ఈనెల 7న ప్రారంభం కానున్నాయి. ఇక ఒక రోజు మాత్రమే మిగిలి ఉంది. ఈ నేపథ్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు నిర్వాహకులు సమాయత్తమవుతున్నారు. ఇప్పటికే మండపాలను సిద్ధం చేసేపనిలో నిమగ్నమయ్యారు. అయితే పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టర్ ఆఫ్ ప్యారీస్ (పీఓపీ) విగ్రహాలను దూరంగా ఉంచి ఆదర్శంగా నిలవాల్సిన తరుణమిదే. పర్యావరణ హితమైన మట్టి విగ్రహాలను పూజించేందుకు ముందుకు రావాల్సిన బాధ్యత అందరిపై ఉంది. ఈ దిశగా గ్రామాల నుంచి నగరం వరకు అందరూ ఆలోచన చేయాల్సిన అవసరం ఉంది.

పనులకు ఆటంకం కలగొద్దని పూజలు..

చేపట్టిన పనులు ఎలాంటి ఆటంకాలు, అడ్డంకులు రాకుండా నిర్విఘ్నంగా జరగాలని గణనాథుడిని పూజిస్తారు. గణనాయకుడు జన్మించింది పార్వతీదేవి మేనినలుగు మట్టి నుంచేనని శాస్త్రాలు చెబుతున్నాయి. అందుకే మట్టి వినాయకుడిని పూజిస్తే చేపట్టే కార్యక్రమాలు నిర్విఘ్నంగా జరిగి ముక్తి కలుగుతుందని విశ్వసిస్తారు. ప్రకృతి ప్రేమికులు సైతం వినాయకుడిని పూజిస్తే ప్రకృతిని ప్రేమించినట్లేనని చెబుతారు.

రంగులతో అనర్థం..

విగ్రహాల తయారీకి వినియోగించే రంగులు అనారోగ్యానికి అత్యంత హానికరం. వినాయక ప్రతిమలను నిమజ్జనం చేసే సందర్భంగా నీటిలో ఈ రంగులు కలిసిపోవడం వల్ల నీరు కలుషితమవుతుంది. అంతేకాకుండా ప్లాస్టర్ ఆఫ్ ప్యారీస్ విగ్రహాలు ఏర్పాటు చేయడంతో వెలువడే విషవాయువుల వల్ల వాతావరణం కలుషితమై మానవాళికి ముప్పు ఏర్పడుతుంది.


విక్రయానికి సిద్ధంగా ఉన్న మట్టి వినాయక విగ్రహాలు

మట్టి వినాయకుడితో ఉపయోగాలు ..

మట్టి వినాయకుడిని పూజించడం వల్ల ఎన్నో ఉపయోగాలున్నాయి. ప్రకృతిని పూజించే అవకాశం కలుగుతుంది. నిమజ్జనం సందర్భంగా మట్టి నీటిలో సులభంగా కరుగుతుంది. నీటిలోని జీవరాసులకు ఎలాంటి హాని కలగదు. అదేవిధంగా నీరు కూడా కలుషితం కాదు.


కాజీపేటలో మట్టితో వినాయక విగ్రహం తయారు చేస్తున్న కళాకారుడు

మూడేళ్లుగా మట్టి వినాయకుడినే ప్రతిష్ఠిస్తున్నాం..



ప్లాస్టర్ ఆఫ్ ప్యారీస్‌తో కలిగే అనర్థం ప్రజలకు ఇప్పటికే అర్థమైంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వేల సంఖ్యలో వినాయక విగ్రహాలు ఏర్పాటు చేస్తుండడం బాగానే ఉన్నా.. ఎంత మంది మట్టితో తయారు చేసిన విగ్రహాలను పూజిస్తున్నారనే విషయం ముఖ్యం. మూడేళ్లుగా మా కాలనీలో మట్టి గణనాథుడినే ప్రతిష్ఠిస్తున్నాం.

-అరూరి సాంబయ్య, విష్ణుపురి కాలనీ, కాజీపేట

మట్టి వినాయకులను పూజిద్దాం

- వరంగల్ ఎంపీ కావ్య


వాల్ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎంపీ కావ్య, తదితరులు

హన్మకొండ చౌరస్తా: పర్యావరణ పరిరక్షణ కోసం మట్టి వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించి పూజిద్దామని వరంగల్ ఎంపీ కడియం కావ్య అన్నారు. ప్రపంచ పర్యావరణ సంస్థ ఆధ్వర్యాన రూపొందించిన మట్టి గణపతి విగ్రహాల పంపిణీ, వాల్ పోస్టర్లను హనుమకొండలోని నివాసంలో గురువారం ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కావ్య మాట్లాడుతూ రసాయన రంగులు అద్దిన విగ్రహాల ద్వారా నీరు కలుషితం అవుతుందని, తద్వారా అందులోని జలచరాలు మృత్యువాత పడతాయని చెప్పారు. పండుగలను ప్రకృతి హితంగా జరుపుకుంటూ పర్యావరణ పరిరక్షణలో భాగస్వామ్యులం అవుదామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రపంచ పర్యావరణ సంస్థ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు కొల్ల శరత్‌చంద్రారెడ్డి, జాతీయ కార్యదర్శి సీహెచ్.సాగర్, జనగామ జిల్లా అధ్యక్షుడు నీలం యువరాజు, అరవింద్, రవి, ఉదయ్ పాల్గొన్నారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

- 12 తులాల బంగారు, 80 తులాల వెండి ఆభరణాలు, రూ.2 లక్షల నగదు అపహరణ
- మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో ఘటన

మహబూబాబాద్ రూరల్ : మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ జరిగింది. ఈ ఘటనలో 12 తులాల బంగారు, 80 తులాల వెండి ఆభరణాలు, రూ.2 లక్షల నగదు అపహరణకుగురికాగా ఈ విషయం గురువారం ఆలస్యంగా వెలుగు చూసింది. బాధితుడు కాసోజు బ్రహ్మాచారి కథనం ప్రకారం.. పౌరోహిత్యం చేసుకుని కుటుంబాన్ని పోషించుకుంటున్న కాసోజు బ్రహ్మాచారి మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని కంకర మిల్ తండ సమీపంలో నివసిస్తున్నాడు. ఆయన భార్య అశ్విని గర్భిణి కాగా ఆమె ఆరోగ్య పరిస్థితి సరిగా లేకపోవడంతో గత నెల 31వ తేదీన హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రికి వెళ్లారు. ఈ క్రమంలో ఈ నెల 2వ తేదీన వారి బంధువు.. బ్రహ్మాచారి ఇంటి ముందు నుంచి వెళ్తూ ఇంటి తలుపులు తెరచి ఉండడాన్ని గమనించి బ్రహ్మాచారికి ఫోన్ చేసి చెప్పారు. దీంతో వారు హుటాహుటిన ఇంటికి వచ్చి చూసి చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఫింగర్ ప్రింట్స్ బృందం ఘటన స్థలంలో ఆధారాలు సేకరించింది. అనంతరం బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.


ఆధారాలు సేకరిస్తున్న ఫింగర్ ప్రింట్స్ బృంద సభ్యుడు

ప్రకృతి సేద్యంతోనే మానవ మనుగడ

- త్రిపుర గవర్నర్ ఎన్.ఇంద్రసేనారెడ్డి

కేసముద్రం: ప్రకృతి వ్యవసాయంతోనే భవిష్యత్‌లో మానవ మనుగడ సాధ్యమని త్రిపుర గవర్నర్ ఎన్.ఇంద్రసేనారెడ్డి అన్నారు. గురువారం మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం తాళ్లపూసపల్లి గ్రామంలో అభినవ్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా అభినవ్ ఫౌండేషన్ ఆధ్వర్యాన ప్రకృతి వ్యవసాయంపై నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రకృతి వ్యవసాయం అవసరమని, ఆర్గానిక్ పంటల సాగు ద్వారా రైతులకు అధిక లాభాలు వస్తాయన్నారు. సేంద్రియ ఎరువులతో పండించిన పంటలను ఆహారంగా తీసుకోవడం వల్ల ఆరోగ్యంతో దృఢంగా ఉంటారన్నారు. ప్రధానమంత్రి మోదీ సులభతరమైన పద్ధతిలో వ్యవసాయం చేసేందుకు డ్రోన్ పథకం ద్వారా డ్రోన్, ఇతర పరికరాలను సబ్సిడీపై ఇస్తున్నట్లు పేర్కొన్నారు. త్రిపురతోపాటు ఇతర రాష్ట్రాల్లో ఆర్గానిక్ పంటలకు అధిక ప్రాధాన్యం ఇస్తారని, ప్రధాని చేపట్టే ప్రతీ కార్యక్రమంలో ఆర్గానిక్‌తో కూడిన వంటకాలనే భోజనంగా అందిస్తారని తెలిపారు. అనంతరం డ్రోన్‌లను పరిశీలించారు. నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి మాట్లాడుతూ.. ప్రతీరైతు ప్రకృతి వ్యవసాయం చేయాలని, సేంద్రియ పద్ధతిలో పండించిన పంటలకు తప్పకుండా మార్కెట్లో ధర లభించేలా తాను చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ప్రముఖ ప్రకృతి సాగు శిక్షకుడు విజయరాం మాట్లాడుతూ.. రసాయన ఎరువుల వినియోగంతో పండించే పంటలను తినడం వల్ల ఎసిడిటీ వస్తుందని చెప్పారు. తాము 15 ఏళ్లుగా ప్రకృతి వ్యవసాయం చేస్తున్నామని, ఆ పంటనే తిరుపతిలో శ్రీవేంకటేశ్వరస్వామి వద్ద నైవేద్యం సమర్పిస్తున్నట్లు పేర్కొన్నారు. రైతులు భూతాపాన్ని తగ్గించేలా వ్యవసాయ పద్ధతులు పాటించాలని సూచించారు. ముందు త్రిపుర గవర్నర్‌కు కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్, ఎస్పీ సుధీర్ రామనాథ్ కేకన్ స్వాగతం పలికారు. అనంతరం పోలీసులు గౌరవ వందనం చేశారు. సాల్లేటి జైపాల్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ డేవిడ్, డీపీఓ విజయనిర్మల, ఆర్డీఓ అలివేలు, డీఎస్పీ తిరుపతిరావు, తహసీల్దార్ దామోదర్, ఏఓ వెంకన్న, శాస్త్రవేత్త క్రాంతికుమార్, సంకు శ్రీపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి

ముగిసిన ఏసోబు అంత్యక్రియలు

- నివాళులర్పించిన మాజీ మావోయిస్టులు, రాజకీయ నాయకులు
- కన్నీటి పర్యంతమైన కుటుంబ సభ్యులు, స్థానికులు
- ఎరుపెక్కిన టేకులగూడెం గ్రామం

మడికొండ: ఛత్తీస్‌గఢ్ బార్డర్‌లో బుధవారం జరిగిన ఎదురుకాల్పుల్లో మృతి చెందిన మావోయిస్టు కేంద్ర మిలిటరీ ఇన్‌చార్జ్ మాచర్ల ఏసోబు అలియాస్ జగన్ అలియాస్ దాదా రణదేవ్ అంత్యక్రియలు గురువారం హనుమకొండ జిల్లా కాజీపేట మండలం టేకులగూడెంలో అశ్రునయనాల మధ్య జరిగాయి. కుటుంబ సభ్యులు ఏసోబు మృతదేహాన్ని అంబులెన్స్‌లో ఉదయం 9 గంటల సమయంలో గ్రామానికి తీసుకొచ్చారు. కుటుంబ సభ్యులు, స్థానికులు కన్నీటి పర్యంతమయ్యారు. ఎర్ర జెండాలు రెపరెపలు, విప్లవ గేయాల మధ్య అంతిమ యాత్ర సాగింది. తరలివచ్చిన మాజీ మావోయిస్టులు, రాజకీయ నాయకులు నివాళులర్పించారు. స్థానిక ఎస్సీ కాలనీ సమీప శ్మశాన వాటికలో అంత్యక్రియలు పూర్తి చేశారు. మాచర్ల ఏసోబుకు విప్లవ జోహార్లు అంటూ.. నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మాజీ మావోయిస్టులు భారతక్క, గాదె ఇన్నయ్య, గాజర్ల అశోక్, న్యూడెమాక్రసీ జిల్లా నాయకులు రాచర్ల బాలరాజు, ఎలకంటి రాజేందర్, గంగుల దయాకర్, మాజీ ఎమ్మెల్యేలు తాటికొండ రాజయ్య, అరూరి రమేశ్, దాస్యం వినయ్‌భాస్కర్, రాష్ట్ర సీడ్ ఆయిల్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి, కార్పొరేటర్లు, బంధుమిత్రుల సంఘం సభ్యులు, స్థానిక నాయకులు అంతిమ యాత్రలో పాల్గొన్నారు.


టేకులగూడెంలో ఏసోబు అంతిమయాత్ర


రోదిస్తున్న కుటుంబ సభ్యులు

కల్లెడ ఆణిముత్యం దీప్తి..

- పారాలింపిక్స్‌లో పతకం తేవడంతో అంతర్జాతీయంగా పేరు
- ఊరే గెలిచినట్టుగా సంబరాలు.. తల్లిదండ్రుల్లో ఆనందం
- వైకల్యం ఉన్నా పట్టుదలలో కనిపించని లోపం

సాక్షి, వరంగల్: వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం కల్లెడ గ్రామం.. ఇప్పుడు ఈ పేరు అంతర్జాతీయ యవనికపై మార్మోగుతోంది. ఎందుకంటే పారిస్‌లో జరిగిన పారాలింపిక్స్‌లో ఈ గ్రామానికి చెందిన జీవాంజి దీప్తి కాంస్య పతకం సాధించడమే. ట్విట్టర్లు, ఇన్‌స్టాగామ్ వేదికగా ఆమె విజయాన్ని అందరూ స్మరిస్తుంటే.. గ్రామస్తులు మాత్రం ఆమె పతకం అందుకునేందుకు పడిన శ్రమను గుర్తు చేసుకుంటూ కీర్తిస్తున్నారు. దీప్తితో చదివిన స్నేహితులు, గ్రామ ప్రజలతోపాటు తల్లిదండ్రులు సంబరపడుతున్నారు. దివ్యాంగురాలైన దీప్తి జీవితం ఎలా ఉంటుందని అనుకున్న గ్రామస్తులు.. పారిస్‌లో కాంస్య పతకం సాధించడాన్ని చూసి కూతురంటే ఇలా ఉండాలి అని అంటున్నారు. ఆమె గెలిస్తే ఊరే గెలిచినట్టుగా సంబరాలు చేసుకుంటున్నారు.


ఊరిలో ఏర్పాటు చేసిన బ్యానర్

ఊరే గెలిచినట్టుంది..



మా కూతురిని చూసి చాలా మంది ఎలా ఉంటుందోనని అంటుండేవారు. ఆ సమయంలో నాకు కూడా చాలా ఇబ్బందిగా అనిపించేది. రన్నింగ్‌లో చిరుతలా పరుగులు తీస్తూ పతకాలు తెస్తుంటే మా ఆనందానికి అవధులు లేవు. పారిస్‌లో జరిగిన పారాలింపిక్స్‌లో మహిళల 400 మీటర్ల టీ20 కేటగిరీ ఫైనల్లో మూడో స్థానంలో కాంస్య పతకం తీసుకురావడంతో నా జన్మకు ఇక ఇది చాలు అనిపించింది. మా గ్రామమే గెలిచినట్టుగా సంబరాలు చేసుకోవడం చూస్తుంటే మాటలు రావడం లేదు. వైకల్యాన్ని అధిగమించి దేశమే గర్వపడే విధంగా నిలిచిన దీప్తికి ప్రభుత్వం ఉద్యోగం, ఇంటి స్థలం ఇవ్వాలి. ఆమెను ప్రోత్సహిస్తే ప్రపంచ స్థాయిలో మరిన్ని పతకాలు భారత్‌కు రావడం ఖాయం.


-యాదగిరి, దీప్తి తండ్రి

పారిస్‌లో పరుగులు..




చిన్నప్పటి నుంచి పరుగు పందెం అంటే దీప్తి ఆసక్తి చూపేది. స్నేహితురాళ్లతో కలిసి గ్రామంలో పరుగులు తీసేది. వైకల్యం ఉన్నా తనలో కనిపించకుండా జాగ్రత్త పడుతూ మనో ధైర్యంతో ముందుకెళ్లింది. పాఠశాలలో నిర్వహించే ఆటల్లో ఎప్పుడూ మొదటి స్థానంలో నిలిచేది. అలా ఆమెలో ఉన్న ఆసక్తిని గమనించి ప్రోత్సహించాం. ఆ సమయంలో ఉపాధ్యాయులు కూడా ప్రోత్సహించడంతోనే ఇప్పుడూ పతకాలు తీసుకురాగలుగుతోంది. పేదరికం ఉన్నా ఎక్కడ పోటీలకు వెళ్లినా తిరస్కరించలేదు. కల్లెడ నుంచి పారిస్ వరకు నా కూతురు పయనం ఉండడం, చిన్నప్పుడు కల్లెడలో చేసిన పరుగులే...ఇప్పుడూ పారిస్‌లో నాకు కనిపించాయి. కాంస్యం సాధిస్తే దేశమే గెలిచినట్టు ఉంది. ముఖ్యంగా మా ఊరే గెలిచినట్టు సంబరాలు చేసుకోవడం జీవితంలో మరిచిపోలేని అనుభూతి. -ధనలక్ష్మి, దీప్తి తల్లి

కల్లెడకు పేరు తెచ్చింది..



దీప్తిని నా చిన్నప్పటి నుంచి చూస్తున్నా. కల్లెడలోని ఆర్డీఎఫ్ పాఠశాలలో కలిసి ఒకటి నుంచి ఆరో తరగతి వరకు కలిసి చదివాం. ఆ సమయంలోనే వ్యాయామ ఉపాధ్యాయుడు వెంకటేశ్వర్లు జనవరి 26, ఆగస్టు 15 సందర్భంగా ఆటల పోటీలు నిర్వహించేవారు. ముఖ్యంగా పరుగు పందెంలో దీప్తి మొదటి వరుసలో ఉండేది. బహుమతులు గెలుచుకునేది. పారిస్‌లో జరిగిన పారాలింపిక్స్‌లోనూ పతకం సాధించేందుకు తీసిన పరుగులు చూస్తుంటే చిన్నతనంలో ఉన్న ఆ కసినే కనిపించింది. నా స్నేహితురాలు దేశం గర్వించే విధంగా రాణించడం ఆనందంగా ఉంది. కల్లెడకు మంచి పేరు తీసుకొచ్చింది. -మల్యాల రమ్య, స్నేహితురాలు

గ్రామస్తులకే గర్వకారణం..



దీప్తి ఏది అనుకుంటే అది సాధించడంలో దిట్ట. ఆమెకు వైకల్యం కూడా అడ్డు రాలేదు. పారిస్ పారాలింపిక్స్‌లో పతకం సాధించడం ఆమెకే కాదు ఊరికే గర్వకారణం. చిన్నప్పటి నుంచి కొందరు ఆమెను అవహేళన చేసినా, ఇప్పుడు ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తోపాటు ప్రముఖులతో శెభాష్ అనిపించుకోవడం కల్లెడ గ్రామ పేరు ప్రతిష్ఠను ఇనుమడింపజేసేలా చేసింది.

- ముదురుకుల్లా రమేశ్, కల్లెడ

డెంగీతో యువకుడి మృతి


విజయ్(ఫైల్)

కొత్తగూడ: డెంగీ జ్వరంతో ఓ యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని గాంధీనగర్‌లో జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. మల్లెల విజయ్(35)కి వారం క్రితం జ్వరం రావడంతో చికిత్స నిమిత్తం వరంగల్‌లోని ఓ ప్రవేట్ ఆస్పత్రికి తరలించారు. పరిశీలించిన వైద్యులు తెల్ల రక్తకణాలు తగ్గిపోయినట్లు గుర్తించి చికిత్స అందించారు. పరిస్థితి విషమించి గురువారం మృతి చెందాడు. కాగా, ములుగు మాజీ జెడ్పీ చైర్ పర్సన్ బడే నాగజ్యోతి.. మల్లెల విజయ్ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

చెరువులో పడి పశువుల కాపరి..


రాజు (ఫైల్)

కాటారం: గేదెలను చెరువు నుంచి బయటకు వెళ్లగొట్టడానికి వెళ్లిన ఓ పశువుల కాపరి కందకంలో మునిగి మృతి చెందాడు. ఈ ఘటన గురువారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలం ప్రతాపగిరి జీపీ పరిధి మల్రిపల్లిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన నలుబోతుల రాజు(25) పశువుల కాపరిగా పని చేస్తున్నాడు. ఈ క్రమంలో రాజు ఉదయం గేదెలను మేపడానికి బొప్పారం శివారులోని దేవుని చెరువు వైపునకు వెళ్లాడు. గేదెలు చెరువులోకి వెళ్లడంతో వాటిని బయటకు వెళ్లగొట్టడానికి అందులోకి దిగాడు. చెరువులో పెద్ద కందకాలు ఉండడంతో రాజు లోతు తెలియక అందులో మునిగిపోయి గల్లంతయ్యాడు. గమనించిన స్థానికులు కుటుంబీకులకు సమాచారం అందించి నీటిలో వెతకగా రాజు మృతదేహం లభించింది. కాగా, రాజు భార్య గతేడాది ఆత్మహత్యకు పాల్పడగా తల్లి మల్లక్కతో ఉంటున్నాడు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మ్యాక అభినవ్ తెలిపారు.

విధుల్లో అలసత్వం ఉండొద్దు

- ఆర్‌జేడీఎం, పర్సన్ ఇన్‌చార్జ్ ఉప్పుల శ్రీనివాస్

వరంగల్: వరంగల్ వ్యవసాయ మార్కెట్ పరిధిలోని అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది విధుల్లో అలసత్వం ప్రదర్శిస్తే చర్యలు తప్పవని ఆర్‌జేడీఎం, మార్కెట్ పర్సన్ ఇన్‌చార్జ్ ఉప్పుల శ్రీనివాస్ అన్నారు. ఇటీవల మార్కెటింగ్ డైరెక్టర్ లక్ష్మీబాయి వచ్చిన సందర్భంలో చాంబర్ ప్రతినిధులు, కూరగాయల మార్కెట్ వ్యాపారులు పలు అంశాలను ఆమె దృష్టికి తీసుకొచ్చారు. డైరెక్టర్ సూచనల మేరకు పర్సన్ ఇన్‌చార్జ్‌గా జేడీఎం గురువారం వరంగల్ మార్కెట్ కమిటీ ప్రధాన కార్యాలయంలో అధికారులు, సిబ్బందితో నిర్వహించిన అంతర్గత సమావేశంలో మార్కెట్ పరిస్థితులు సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏనుమాములలోని గ్రెయిన్ మార్కెట్, లక్ష్మీపురంలోని మోడల్ కూరగాయల మార్కెట్, పండ్ల మార్కెట్‌లలో అధికారులు, ఉద్యోగులు, ఔట్ సోర్సింగ్ సిబ్బంది హాజరును సంబంధిత సూపర్వైజర్ రోజూ తీసుకోవాలని ఆదేశించారు. ఎవరు ఎక్కడ పనిచేస్తున్నారనే విషయంపై సంబంధిత ఇన్‌చార్జ్‌లు దృష్టి సారించాలన్నారు. మార్కెట్లలో పారిశుద్ధ్య పనులు పొందిన కాంట్రాక్టర్లు మార్కెట్లు శుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. ఎక్కడపడితే అక్కడ చెత్త, మురిగిన కూరగాయలు ఉంటే సంబంధిత కాంట్రాక్టర్ల బిల్లుల్లో కోత తప్పదని హెచ్చరించారు. లక్ష్మీపురం కూరగాయల మార్కెట్‌లోని కమీషన్ వ్యాపారులు, కవర్ షెడ్ వ్యాపారులతో మాట్లాడి అద్దె బకాయిలు వెంటనే చెల్లించాలని ఆదేశించారు. సమావేశంలో డీడీఎం పద్మావతి, మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి పి.నిర్మల, గ్రేడ్-2 కార్యదర్శులు శ్రీరామోజు రాము, ఎఎస్‌లు అనిల్, రాజేందర్, అకౌంటెంట్ సుకన్య పాల్గొన్నారు.


వరంగల్ మార్కెట్ కమిటీ ప్రధాన కార్యాలయం